సంపుటి : 9
సంచిక : 324
ఆదివారం
16 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

2036 ఒలింపిక్స్ కోసం

## టాలెంట్ హంట్

ఎర్రకోట వేదికగా ప్రకటించిన మోదీ



**ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ భారత క్రీడా రంగానికి ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు అందించేందుకు జాతీయ స్థాయిలో టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. "క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ప్రపంచవేదికలపై మన జాతీయ గీతాన్ని తరచూ వింటుంటాం. మన మువ్వన్నెల జెండా ఎగరవేయడం చూస్తున్నాం. టాప్స్ గొప్ప మిగతా .. 2లో..



## లోక్‌సభలో గవర్నర్ 'ఎట్ హోం'

సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గవర్నర్ దంపతులు ఆహ్వానితులకు తేనీటి విందు ఇచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వయంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు,



సైనిక అధికారులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది. అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మిగతా .. 2లో..

కసితో పనిచేద్దాం.. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా

## అభివృద్ధి సాధిద్దాం

విజయవాడలోని స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారా లోకేష్



**విజయవాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగస్టు 15 ఓ తేదీ మాత్రమే కాదని.. చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ విద్యా రంగంలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలపై సీఎం ఫొటో, తన ఫొటో లేదని, ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలను వేశామన్నారు. "విద్యను ఉపాధి రంగానికి అనుసంధానం చేస్తున్నాం. రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించింది. పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ మిగతా .. 2లో..

## కాకినాడలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ఆకట్టుకున్న పోలీసు జాగిలాల ప్రదర్శన.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- 242 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల ప్రదానం





**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ జిల్లా ప్రగతి, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సందేశాన్ని అందించారు. వేడుకలకు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియ తదితరులు ఘన స్వాగతం పలికారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం నిర్వహించిన పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాగిలాలు ప్రదర్శించిన వివిధ విన్యాసాలు, శిక్షణా నైపుణ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన మిగతా .. 2లో..

## అనకాపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

హోం మంత్రి చేతుల మీదుగా 'మెరిట్' అవార్డు అందుకున్న గోరింతల రజిని కుమారి





**అనకాపల్లి, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అనకాపల్లి జిల్లాలో అత్యంత వైభవంగా, దేశభక్తి పరిమళాలు వెదజల్లేలా ఘనంగా జరిగాయి. ఈ వేడుకల ప్రధాన వేదికపై ప్రజా సేవను గుర్తించే అరుదైన క్షణం ఒకటి అందరి దృష్టిని ఆకర్షించింది. నిరంతరం ప్రజలకు సేవలందిస్తూ, విధి నిర్వహణలో అంకితభావం కనబరుస్తున్న ఎలమంచిలి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఉద్యోగి గోరింతల రజిని కుమారి రాష్ట్రస్థాయి ప్రముఖుల అభినందనలతో పురస్కారాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల ప్రధాన వేదికపై రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేసి, తన సువర్ణ హస్తాల మీదుగా రజిని కుమారికి "సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్" ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ వేడుకలో అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ విజయ కృష్ణన్, ఐ.ఎ.ఎస్. కూడా ప్రత్యేక అతిథిగా పాల్గొని ఆమెను అభినందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హోమ్ మంత్రి వంగలపూడి అనిత స్వయంగా అవార్డు అందించి, రజిని కుమారి సేవలను కొనియాడడం ఆ ప్రాంత వైద్య వర్గాల్లో విశేష చర్చనీయాంశమైంది.

**సేవలే ప్రామాణికం..**

ఎలమంచిలి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ద్వారా స్థానిక రోగులకు ఎల్లప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందించడంలో రజిని కుమారి ముందుంటున్నారని అధికారులు ప్రశంసించారు. విధి నిర్వహణలో ఆమె చూపుతున్న మిగతా .. 2లో..

భోగాపురం విమానాశ్రయంలో

## బాధ్యతలు స్వీకరించిన సీఐఎస్ఎఫ్

భోగాపురం విమానాశ్రయం భద్రతలో కీలక ఘట్టం

అత్యున్నత స్థాయి భద్రతను, స్నేహపూర్వకమైన సేవలను అందిస్తామని వెల్లడి



**భోగాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా వ్యవస్థలో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) అధికారికంగా తమ భద్రతా బాధ్యతలను స్వీకరించింది. ఈ సందర్భంగా మిగతా .. 2లో..

జగన్ కేసులపై సుప్రీంకోర్టు

## ప్రత్యేక దృష్టి సారించాలి

జగన్ బెయిల్ రద్దు చేయాలి

జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డిమాండ్



**జగ్గంపేట, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. జగన్‌కు సంబంధించిన కేసులపై దేశ అత్యున్నత నాయస్థానమైన సుప్రీం కోర్టు ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు వరుసగా అఘాయిత్యాలకు మిగతా .. 2లో..



(మొదటిపేజీ తరువాయి)

## 2036 ఒలింపిక్స్ కోసం టాలెంట్ హంట్

విజయాన్ని సాధించింది. ఖేలో ఇండియా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, బీచ్ గేమ్స్, వింటర్ గేమ్స్, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ఇలా ఏ రంగంలోనైనా భారతదేశం వేగంగా దూసుకుపోతోంది. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు మనం కూడా పోటీపడుతున్నాం. 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నాం. ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, సుమారు 350 ఈవెంట్లు ఉంటాయి. అయితే చాలా క్రీడల్లో కనీస అర్హత సాధించలేకపోతున్నందున.. మూడింట రెండొంతుల గేమ్స్‌లో మనం పోటీ కూడా పడలేకపోతున్నాం. 2036లో మనం కనీసం మూడు వంతుల ఈవెంట్లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. టాలెంట్ హంట్‌తో దేశంలోని ప్రతిచోట నుంచి 5 నుంచి 15 ఏళ్ల వయసు గల ప్రతిభావంతులను గుర్తిస్తాం. వారు ప్రత్యేక శిక్షణ పొందుతారు" అని మోదీ వెల్లడించారు.

## లోక్ భవన్‌లో గవర్నర్ 'ఎట్ హోం'..

ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కాకినాడలో ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న అనంతరం పవన్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో, ఆయన ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనడంలేదని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమండ్రిలో వైద్య పరీక్షల అనంతరం పవన్ కల్యాణ్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

## అభివృద్ధి సాధిద్దాం

పరిరక్షణ, రైల్వే జోన్ సాధించాం. అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వానికి జోడెద్దులు. పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి రాష్ట్రానికి చిరునామాగా మారాయి. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంకా ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తాం? అన్నిరంగాల్లో ఏపీని ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రమాణం చేద్దాం. కసితో, పట్టుదలతో పనిచేద్దాం. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా అభివృద్ధి చేద్దాం" అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

**విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి పతకాలు అందించిన మంత్రి లోకేష్**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్ నగర్ లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆద్యంతం ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విద్య, ఐటీ శాఖల మంత్రి హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విన్యాసాలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా పోలీస్, హోంగార్డ్, స్కౌట్స్ అండ్ గైడ్స్, గర్ల్స్, జీఎన్ ఎమ్, యూత్ రెడ్ క్రాస్, మై భారత్, యూత్ టైం బ్యాంక్ కంటిజెంట్ మంత్రి నారా లోకేష్ కు గౌరవ వందనం సమర్పించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

అనంతరం రాష్ట్ర ప్రగతిని సూచిస్తూ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాలు ప్రదర్శించారు. శ్రీకనకదుర్గ అమ్మవారి శకటం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శకటం, పంచాయతీ రాజ్ శాఖ శకటం, గ్రామీణాభివృద్ధి శకటం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ- జలవనరుల శాఖ శకటం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శకటం, వ్యవసాయ శాఖ శకటం, పశుసంవర్ధక, ఉద్యానశాఖ, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం శకటం, పౌరసరఫరాల శాఖ శకటం, పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష శకటం, వైద్య, ఆరోగ్యశాఖ శకటం, రవాణశాఖ శకటం, పరిశ్రమల శాఖ శకటం, అటవీశాఖ శకటం, విజయవాడ నగరపాలక సంస్థ శకటం, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డ్రోన్ నిఘా శకటం ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ విన్యాసాలు ప్రతిఒక్కరినీ అలరించాయి. వివిధ ప్రభుత్వ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి మంత్రి నారా లోకేష్ పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## కాకినాడలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నిర్వహించారు. విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. శకటాల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ అందజేశారు.

**242 మందికి ప్రశంసా పత్రాలు**

జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున గుర్తించి సత్కరించారు. వివిధ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన 242 మంది అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ప్రశంసా పత్రాలను అందజేశారు. తమ సేవలకు గుర్తింపు లభించడంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా), లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య, జగ్గంపేట, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డీఆర్వో డా. పి. తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. చివరగా వందేమాతరం గేయం, జాతీయ గీతాలాపనతో కాకినాడ జిల్లాలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

## అనకాపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

ప్రత్యేక చొరవ, బాధ్యతాయుతమైన పనితీరు మిగతా ఉద్యోగులందరికీ ఆదర్శప్రాయమని వారు కొనియాడారు.

**తోటి ఉద్యోగుల్లో హర్షం..**

రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రతిష్టాత్మక ప్రశంసా పత్రం అందుకోవడం తమ డిస్పెన్సరీకి దక్కిన గౌరవంగా తోటి ఉద్యోగులు, ఆయుర్వేద వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు గోరింతల రజిని కుమారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ముఖ్య అతిథి చేతుల మీదుగా తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించడం మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత అంకితభావంతో సేవలందించేందుకు ఈ గుర్తింపు ఎంతో స్ఫూర్తినిస్తుందని గోరింతల రజిని కుమారి ఆనందం వ్యక్తం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన సీఐఎస్ఎఫ్

విమానాశ్రయ ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, సిబ్బందితో కలిసి సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీణ్ రంజన్ మాట్లాడుతూ, కేవలం 31 నెలల రికార్డు సమయంలో ఈ విమానాశ్రయ నిర్మాణం పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు అత్యున్నత స్థాయి భద్రతతో పాటు స్నేహపూర్వకమైన సేవలు అందించేందుకు సీఐఎస్ఎఫ్ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో మీడియా మిత్రుల నుంచి నిరంతర సహకారం, పూర్తి మద్దతును ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**జగన్ కేసులపై సుప్రీంకోర్టు**

## ప్రత్యేక దృష్టి సారించాలి

పాల్పడుతున్నారని మండిపడిన జ్యోతుల నెహ్రూ, ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జగన్ బెయిల్‌ను ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. బాధితులకు పరామర్శల పేరుతో జగన్ ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ, శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా వైఖరిపై న్యాయస్థానాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మహిళల ఆదాయం పెరగాలి... ఆరోగ్యం బాగుండాలి

**డ్వాక్రా మహిళల క్రమశిక్షణ దేశానికే ఆదర్శం - గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల నిర్మూలనకు మహిళలు చొరవ తీసుకోవాలి**
**రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిని దూరం పెట్టాలి - స్త్రీ శక్తికి సంవత్సరం-రెట్టింపైన ఆత్మగౌరవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు**



**అమరావతి, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల ఆర్థిక సాధికారతే కుటుంబాల అభ్యున్నతికి మార్గమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళల ఆదాయం పెరగాలని.. ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుండాలని.. అప్పుడే కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తుందని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల స్థితిగతులను తెలుసుకుని, బాగా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'స్త్రీ శక్తికి సంవత్సరం-రెట్టింపైన ఆత్మగౌరవం' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అమరావతి పరేడ్ గ్రౌండ్స్ నుంచి మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన సీఎం.. తన క్యాంప్ కార్యాలయంలో వారికి తేనేటీ విందు ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చదువుకుంటే మెరుగైన ఆలోచనలు వస్తాయని.. మంచి ఆలోచనలు వస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం అన్నారు. అందుకే ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్యం మెరుగుపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని.. ప్రజలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య అలవాట్లపైనా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సంజీవని వంటి కార్యక్రమాలతో ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నామని చెప్పారు. మహిళలను ఒకప్పుడు చిన్నచూపు చూసేవారని... ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చంద్రబాబు అన్నారు. మహిళలే ఎక్కువగా సంపాదించే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు. దీనికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి తానే శ్రీకారం చుట్టాననే విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాల ద్వారా సుమారు రూ.25 వేల కోట్ల పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉందని తెలిపారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మహిళలు క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తున్నారని ప్రశంసించారు. కొన్ని పెద్ద కంపెనీలు కూడా రుణాలు ఎగవేస్తున్న పరిస్థితుల్లో.. డ్వాక్రా మహిళలు మాత్రం తీసుకున్న రుణాలను ఠంచనుగా చెల్లిస్తున్నారని కొనియాడారు. పీ4 విధానం ద్వారా పేద కుటుంబాలకు చేయూతనిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**'అను నేను' సంకల్పంతో ముందుకు...**

ప్రతి ఒక్కరూ 'అను నేను' అనే సంకల్పంతో తమ కుటుంబాన్ని, తమ గ్రామాన్ని, తమ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్న సంతృప్తితో ఆగిపోకుండా.. వాటిని ఆధారంగా చేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మహిళలు ఉద్యోగాలు, వ్యాపారాలు, స్వయం ఉపాధి రంగాల్లో మరింత ముందుకు రావాలని సీఎం ఆకాంక్షించారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని నియంత్రించామని.. ఇప్పుడు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. గంజాయి నిర్మూలనకు డ్వాక్రా సంఘాలు చొరవ తీసుకోవాలని సూచించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారిని మహిళలు ఒక కంట కనిపెడుతూ ఉండాలని అన్నారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని సమాజంలో అశాంతి సృష్టించే వారిని దూరంగా పెట్టే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# ఎన్నో దశాబ్దాల పోరాటం, ఎన్నో తరాల ఉద్యమం

**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు**

**అమరావతి, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతిలో తొలిసారిగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. 'స్వర్ణాంధ్ర విజన్-2047' నేపథ్యంతో నిర్వహించిన వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ జెండా స్వాతంత్ర్యానికి ప్రతీక మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతిబింబమని అన్నారు. దేశ ప్రజల ఐక్యతకు జాతీయ జెండా చిహ్నమని, భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం ఒక్కరోజులో, ఒక్కరి పోరాటంతో సాధ్యం కాలేదని అన్నారు. ఎన్నో దశాబ్దాల పోరాటం, ఎన్నో తరాల ఉద్యమం, ఎందరో మహనీయుల ఆత్మబలిదానాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు.



**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో**

## మంత్రి ఆనంకు అస్వస్థత

**తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆనం**
**ప్రసంగిస్తూ స్పృహ కోల్పోయిన మంత్రి**



**తిరుపతి, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి సుదీర్ఘంగా ప్రసంగిస్తున్న సమయంలో ఆయన స్పృహ తప్పారు. ఈ క్రమంలో ఆయన పక్కకు వాలిపోతుండగా, వేదికపై ఉన్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అప్రమత్తమై ఆయనను కింద పడకుండా పట్టుకున్నారు. ఘటనా స్థలంలో ఉన్న వైద్య బృందం వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, రక్తపోటు (బీపీ) తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. సకాలంలో వైద్య సేవలు అందించడంతో ఆయన కోలుకున్నారు. కాసేపటి విశ్రాంతి తర్వాత మంత్రి ఆనం తిరిగి వేడుకలలో పాల్గొనగా, ఆయన మిగిలిన ప్రసంగాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.

**మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసు**

## అన్నమయ్య జిల్లా డీఎంహెచ్ఓ లక్ష్మీనరసయ్య సస్పెన్షన్



shutterstock.com · 1012867735

**మదనపల్లె, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** మదనపల్లెలో తీవ్ర కలకలం రేపిన కిడ్నీ రాకెట్ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసు విచారణలో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, అన్నమయ్య జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కె. లక్ష్మీనరసయ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి. వీరపాండియన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తగిన ఆధారాలు లేవంటూ డీఎంహెచ్ఓ తప్పుడు నివేదికను సమర్పించి, విచారణను తప్పుదోవ పట్టించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం సదరు ఆసుపత్రి లైసెన్సును రద్దు చేయడంతోనే తన బాధ్యత ముగిసిందని భావించి, పరిపాలనాపరమైన చర్యలను పరిమితం చేశారని ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాకుండా, గౌరవ హైకోర్టుకు ఈ కేసులోని వాస్తవాలను నివేదించడంలో ఆయన విఫలమయ్యారని స్పష్టం చేస్తూ, ఆయనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది.

**కేసు నేపథ్యం:** 2025 నవంబర్‌లో మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ కిడ్నీ రాకెట్ వెలుగు చూసింది. విశాఖపట్నంకు చెందిన యమున (29) అనే మహిళ నుంచి అక్రమంగా కిడ్నీని తొలగించగా, తీవ్ర అస్వస్థతకు గురై ఆమె 2025 నవంబర్ 10వ తేదీన ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం, మధ్యవర్తులు కలిసి మృతదేహాన్ని రహస్యంగా తిరుపతికి తరలించారు. అయితే, ఒప్పందం ప్రకారం తనకు అందాల్సిన రూ.6 లక్షలు ఇవ్వలేదని సూరిబాబు అనే మధ్యవర్తి పోలీసులను ఆశ్రయించడంతో ఈ అక్రమ కిడ్నీ విక్రయాల వ్యవహారం బయటపడింది.

# ఎడిటర్ వాయిస్

## స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం.. రీజన్ అదేనా?

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఓటర్ల జాబితా ఇపుడు కీలకంగా మారింది. పాత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని ఇంతకు ముందు అధికారులు చెప్పినట్లుగా ప్రకటనలు వచ్చాయి. అయితే పాత జాబితాతో ఎలా నిర్వహిస్తారు అన్న విమర్శలు వచ్చిపడ్డాయి. అందులో షిఫ్ట్ అయిన ఓటర్లు చనిపోయిన ఓటర్లు, మ్యాపింగ్ లో లేని ఓటర్లు అంతా కలసి ఏకంగా 45 లక్షల మంది దాకా పక్కకు పోయారు. డబుల్ ఎంట్రీ ఓటర్లను కూడా తగ్గించి చూపించారు. దాంతో నాలుగు కోట్ల దాకా ఉన్న ఏపీ ఓటర్ల సంఖ్య మూడున్నర కోట్లకు వచ్చింది. దాంతో పాత జాబితా అంటే ఇవన్నీ మళ్లీ చర్చకు వస్తాయి. దాంతోనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విషయంలో తర్జన భర్జన పడుతోంది అంటున్నారు

**ఏపీలో ఓటర్ల తుది జాబితా :**

ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ ఓటర్ల తుది జాబితా ఈ ఏడాది అక్టోబర్ 3 న విడుదల కానుంది. ప్రస్తుతం ముసాయిదా జాబితా అందుబాటులో ఉంది, దీనిపై అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 30 వరకు కొనసాగుతుంది. అందులోనే పక్కాగా వివరాలు అన్నీ వస్తాయని అంటున్నారు. సర్ ప్రక్రియలో తొలగించిన 45 లక్షల ఓట్ల నుంచి కూడా వివరణలు తీసుకుని సవరణలు చేస్తే ఓటర్లు ఇంకా పెరుగుతారు. అలాగే యువ ఓటర్లు కొత్త ఓటర్లను కూడా చేరుతారు. అది కచ్చితమైన ఓటర్ల జాబితా అవుతుందని అంటున్నారు. మరి ఆ ఓటర్ల జాబితా చేతిలో పడితేనే తప్ప రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికలను నిర్వహించలేదని అంటున్నారు.

**రెండు నెలల తరువాతనే అంటూ :**

అందుకే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రెండు నెలల తరువాతనే జరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం ఆగస్టు మధ్యలో నడుస్తోంది. అక్టోబర్ 3న తుది జాబితా వచ్చిన తరువాత అన్నీ వేగవంతంగా పూర్తి చేస్తే అదే నెలలో స్థానిక ఎన్నికలు ప్రారంభించి రెండు విడతలుగా నిర్వహించవచ్చు అని అంటున్నారు. ఇక అదే సమయంలో ఓటర్ల జాబితాతో పాటుగా రిజర్వేషన్లు, కోర్టుకేసులు వంటి వాటి విషయంలోనూ స్పష్టత రావలసిన అవసరం ఉంది అని అంటున్నారు. ఇలా ఈ కీలక విషయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉందని చెబుతున్నారు. మొత్తం మీద రాష్ట్ర ఎన్నికల సంఘం అయితే సిద్ధంగా ఉంది.

**దసరా తరువాతనేనా :**

ఇక అక్టోబర్ అంటే పండుగల నెలగా ఉంది. దసరా ఉత్సవాలు పెద్ద ఎత్తున పది రోజుల పాటు సాగుతాయి. దాంతో అక్టోబర్ మూడవ వారం కూడా ముగిసిపోతుంది. అలా అన్నీ పూర్తి చేసుకున్న తరువాత అక్టోబర్ నెలాఖరులో ఎన్నికలు జరిగే వీలుందని అంచనా వేస్తున్నారు. ఆ సమయం అయితే అన్ని విధాలుగా అనుకూలంగానే ఉంటుందని కూటమి ప్రభుత్వం కూడా భావిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద మరో రెండు నెలలకు పైగా స్థానిక ఎన్నికల సమరం ముందుకు జరిగే అవకాశాలు అయితే ఉన్నాయని అంటున్నారు. ఎపుడు ఎన్నికలు జరిగినా కూటమిదే విజయం అని అధికార పార్టీ ధీమాగా ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

కానిస్టేబుల్ ఘాతుకం.. దంపతులను చంపేసి..

## యథావిధిగా స్టేషన్ విధులకు..



### వివాహేతర సంబంధమే మూలం

**సూర్యాపేట పట్టణం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కుమార్తె పంచాయితీ విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన భార్యాభర్తలకు ఓ పోలీస్ కానిస్టేబుల్ అప్పు ఇచ్చాడు. తర్వాత ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఇటీవల కానిస్టేబుల్‌కు పెళ్లి నిశ్చయం కాగా తాను ఇచ్చిన అప్పు విషయంలో వివాదం తలెత్తింది. భవిష్యత్తులో తన పెళ్లికి అడ్డొస్తారని ఆ దంపతులను దారుణంగా హత్య చేశాడు. ఆపై తాను రోజువారీ విధులకు హాజరై..పోలీసు బృందంతో ఘటనా స్థలాన్ని పరిశీలించాడు. హత్యోదంతం వెలుగు చూసిన రెండు రోజుల్లోనే నిందితుడు అరెస్ట్ అయ్యాడు. నిందితుడిని అతడికి సహకరించిన మరో వ్యక్తిని గురువారం సూర్యాపేట జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఈ కేసుకు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ విలేకరులకు వివరాలు వెల్లడించారు.. సూర్యాపేట జిల్లా మోతె మండలం బిక్యాతండా గ్రామానికి చెందిన దంపతులు హలావత్ నాగులు(48), బూబా(41) మండల కేంద్రంలో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. వారి ఇద్దరి కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. వారి కుమార్తె, అల్లుడి మధ్య పంచాయితీ విషయంపై నాగులు, బూబాలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారు. ఈ క్రమంలో బూబాకు అక్కడి కానిస్టేబుల్ ఎండీ షరీఫ్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. అల్లుడు డబ్బులు అడుగుతున్నాడని షరీఫ్ వద్ద బూబా రూ.3 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇటీవల షరీఫ్‌కు వివాహం నిశ్చయం కావడంతో ఆ డబ్బులు కావాలని బూబాను పలుమార్లు అడిగాడు. ఆమె ఇవ్వక పోగా వివాహేతర సంబంధం విషయం కాబోయే భార్యకు చెబుతానని బెదిరింపులకు పాల్పడింది. దీంతో ఎలాగైనా బూబా దంపతులను చంపేయాలని నిర్ణయించుకున్నాడు.

**హత్యకు పథకం ఇలా...**

గొర్రెల రుణం ఇప్పిస్తానని కానిస్టేబుల్ షరీఫ్.. బూబాను నమ్మించాడు. బ్యాంకు వారు పరిశీలనకు వచ్చే సమయానికి గొర్రెలు, షెడ్డు, నీటి వసతి వంటివి ఉన్నట్లు నమ్మించాలన్నాడు. వాటన్నింటినీ నాగులు సిద్ధం చేసి తొలుత షరీఫ్‌కు చూపించేందుకు పిలిపించాడు. పథకం ఒకసారి ఫెయిల్ కాగా ఈసారి వారిద్దరినీ ఎలాగైనా చంపాలని షరీఫ్ నిర్ణయించుకున్నాడు. ఇందుకు పోలీస్‌స్టేషన్‌కు టీలు అందించే సుందర్ సహాయం తీసుకున్నాడు. ఈ నెల 11న రాత్రి పది గంటల ప్రాంతంలో షెడ్డు చూసేందుకు తొలుత నాగులు, షరీఫ్, సుందర్ వెళ్లారు. అక్కడ గొర్రెల ఎరువు వేయడానికి తీసిన గుంత చూపిస్తుండగా షరీఫ్ కర్రతో నాగులుపై తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని ఆ గుంతలోనే పూడ్చిపెట్టాడు. పథకంలో భాగంగా సుందర్ ద్విచక్ర వాహనంపై బూబా ఇంటికి వెళ్లి ఆమెను కూడా తీసుకొచ్చాడు. భర్త కనిపించకపోవడంతో అనుమానం వచ్చి కేకలు వేయగా అదే కర్రతో ఆమెను కూడా హతమార్చాడు.

**వెలుగులోకి వచ్చిందిలా..**

షరీఫ్ 12న యథావిధిగా పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరయ్యాడు. హత్యల విషయం బుధవారం వెలుగులోకి రావడంతో ఆ ప్రదేశాన్ని పలుమార్లు పోలీసు బృందంతో పరిశీలించాడు. సాంకేతిక, సీసీ కెమెరాల ఆధారంగా సుందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న షరీఫ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఛేదించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్థానిక ఎస్సై లచ్చిరెడ్డి, సీసీఎస్ ఎస్సైలు సాయిరాం, హరికృష్ణలను ఎస్పీ అభినందించారు.

యువకుడి ప్రాణం తీసిన

## కుక్క మూత్ర విసర్జన వివాదం



**ఖమ్మం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కుక్క మూత్ర విసర్జన వివాదం ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన ఖమ్మం నగరంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం... డెకరేషన్ పనులు చేసే ఉండేటి శ్రీనాథ్(23) నగరంలోని రంగనాయకుల గుట్టలో తన అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. అతడి తల్లి నాగమణి కేసీఆర్ టవర్స్‌లో నివసిస్తోంది. శ్రీనాథ్ గురువారం అర్ధరాత్రి తన స్నేహితుడు వీరేశ్‌తో కలిసి అతడి ఆటోలో కూర్చుని ఉన్నాడు. అక్కడే నివసించే వేముల మధు అనే యువకుడు పెంపుడు కుక్కతో బయటకు వచ్చాడు. ఆ శునకం వీరు కూర్చున్న ఆటో వద్ద మూత్ర విసర్జన చేయడంతో వివాదం చెలరేగి... మధు, శ్రీనాథ్‌లు ఒకరిపైఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మధు తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి శ్రీనాథ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనాథ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే శ్రీనాథ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నకిలీ గుర్తింపుతో పాస్‌పోర్టులు..

## వీసాకు ప్రయత్నించి అరెస్టు



**గచ్చిబౌలి, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** వేర్వేరు పేర్లు, పుట్టిన తేదీలతో బహుళ పాస్‌పోర్టులు తీసుకొని అమెరికా వీసా పొందేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న మోతుకుపల్లి లక్ష్మీకాంత్ రెడ్డి(55) రియల్ ఎస్టేట్ వ్యాపారి. గతేడాది డిసెంబర్‌లో అమెరికా వెళ్లేందుకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన.. నానక్‌రాంగూడలోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. ఆయన సమర్పించిన పాస్‌పోర్టుతోపాటు ఇతర పత్రాలు అనుమానాస్పదంగా ఉండటంతో కాన్సులేట్ అధికారులు ఈ ఏడాది మార్చి 20న గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి రికార్డులను సేకరించారు. అలాగే యూఎస్ కాన్సులేట్ అందించిన వివరాలతో నిందితుడి వద్ద నాలుగు పాస్‌పోర్టులు ఉన్నట్లు గుర్తించారు. ముద్దన్నోళ్ల లక్ష్మీకాంత్, మేద ప్రసూన్ కుమార్‌రెడ్డి, మేధ ప్రసూన్‌కుమార్‌రెడ్డి, మోతుకుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి ఇలా వేర్వేరు పేర్లతో 1997 నుంచి 2011 మధ్యకాలంలో మొత్తం నాలుగు పాస్‌పోర్టులు పొందినట్లు తేలింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. ఆయన నుంచి పాస్‌పోర్టు పత్రాలతోపాటు ఐఫోన్, ఐప్యాడ్ స్వాధీనం చేసుకున్నారు. అమెరికా వెళ్లేందుకు వీసా కోసం పలుమార్లు ప్రయత్నించగా దరఖాస్తులు తిరస్కరణకు గురికావడంతోనే తప్పుడు పేర్లతో పాస్‌పోర్టులను పొందాడని పోలీసులు తెలిపారు. బయోమెట్రిక్ ఆధారాలు ఉన్నప్పటికీ, తప్పుడు పేర్లతో పాస్‌పోర్టులను ఎలా పొందారనే దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ అక్రమాలకు సహకరించిన దళారులు, పాస్‌పోర్టు కార్యాలయం సిబ్బంది పాత్రపై ఆరా తీస్తున్నారు.















కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించి దృశ్య మాలిక.









# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

కాకినాడ జిల్లా

తూర్పు గోదావరి జిల్లా

డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా


ఆదివారం, 16 ఆగస్టు, 2026



సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత    www.viswamvoice.com


# ఐదేళ్ల పాలనకు ప్రజలే గుణపాఠం చెప్పారు

## అభివృద్ధి-సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వేగుళ్ల
## రాయవరం ఇంటింటా ప్రచారంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల



**రాయవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాయవరం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన 'రెండేళ్ల పాలనలో అభివృద్ధి-సంక్షేమం' ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆయన కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన రెండు డబ్ల్యూబీఎం రోడ్లు, రూ.32.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కూటమి నాయకులు బాణాసంచా, గారడి, తీన్మార్ ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా టీడీపీ తోరణాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం ద్వారా చేనేత కార్మికులకు రూ.25 వేల ఆర్థిక సాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంపై సోమేశ్వరం గ్రామ చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగానికి బదులుగా 'రాజారెడ్డి రాజ్యాంగం' అమలు చేశారని ఆరోపించారు. ఆ పాలనకు ప్రజలు తమ ఓటుతో తగిన సమాధానం చెప్పినా వైసీపీ నేతల్లో మార్పు రాలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలు వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మండల తేదేపా సీనియర్ నాయకులు ఉండవిల్లి రాంబాబు, గ్రామ శాఖ అధ్యక్షులు కోట వీర వెంకటరమణ, వల్లూరి శ్రీనివాస్, మల్లిపూడి చిన్న, జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, బేరాదుర్గ ప్రసాద్, నేతల సురేష్, దేవాంగుల నేతలు నూలు వీర వెంకట సత్యనారాయణ, చల్లా సత్యనారాయణ, కందుకూరి గంగరాజు, ఇందుగమెల్లి అరుణ్, బర్ల రాజు, బొడబల్ల శేషు, గోడి సత్యవతి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, కర్రి వెంకట కృష్ణారెడ్డి, నల్లమిల్లి సతీష్‌రెడ్డి, దేవు శ్రీను, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 59 మంది ఆర్ఎంసి అధికారులు, ఉద్యోగులకు సేవా పురస్కారాలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆర్ఎంసికి చెందిన 59 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతులమీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ ఎ.వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అకౌంటెంట్ ఆర్.నాగమణి, సీఎంఎం వి.రామలక్ష్మి, ఈఈలు ఎం.వి.కె.మాధవి, మదర్షా అలీ, డిప్యూటీ సిటీ ప్లానర్ పి.నాయుడు, ఇతర ఆర్ఎంసి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## దేశభక్తి స్ఫూర్తితో అభివృద్ధి వైపు అడుగులు వేయాలి : బొడ్డు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం రూడా కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనేది కేవలం వేడుక కాదు.. మన బాధ్యతలను గుర్తుచేసే పవిత్రమైన సందర్భమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వేచ్ఛా భారతదేశాన్ని మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలమైన శక్తిగా ఎదుగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని.. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే మనందరి లక్ష్యం కావాలని బొడ్డు వెంకటరమణ చౌదరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనం

### విజ్ఞాన్ విద్యాసంస్థలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రాయవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ఉన్నత తత్వాన్ని కలిగిన దేశం భారత దేశమని చాణక్య నర్సింగ్ హోమ్ అధినేత, ముఖ్య అతిథి డాక్టర్ జి.ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. ఎన్నో దేశాలు భారతదేశంపై దండయాత్రలు చేసినప్పటికీ, మన దేశం ఏ దేశంపైనా దండెత్తని ఘన చరిత్ర కలిగి ఉందన్నారు. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజ్ఞాన్ విద్యాసంస్థల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ జి.ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ భావితరాలు దేశ భవిష్యత్తుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడంతో పాటు, వారు ఉజ్వల భవిష్యత్తులో ఎదిగేలా చేయడమే దేశానికి మనమిచ్చే గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లిడి శేషవేణి, వివిఎస్ఆర్ రూరల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్ రెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి, విజ్ఞాన్ కాంపిటేటివ్ వింగ్ ఇంచార్జ్ డాక్టర్ తేతల సుబ్బిరెడ్డి, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ త్రివేణి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ గారు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలు, సేవలు, దేశభక్తి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

### కాకినాడ మూడవ బెటాలియన్‌లో
## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ కె.నవీన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ కె. నవీన్ కుమార్ మాట్లాడుతూ, వందల ఏళ్ల బానిసత్వం నుంచి దేశానికి విముక్తి లభించిన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవా పథకం, ఉత్తమ సేవా పథకం, ఉత్కృష్ట సేవా పథకం, అతి ఉత్కృష్ట సేవా పథకాల కింద ఎంపికైన సిబ్బందికి, అలాగే ప్రశంసా పత్రాలు పొందిన సిబ్బందికి కమాండెంట్ అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి.డి. గంగరాజు, బి.ఎస్.సి. శేఖర్ రావు, ఎస్. మన్మథరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.ఎం.వి. మోహన్ రావు, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ లక్ష్మి, రిటైర్డ్ పోలీస్ అధికారులు, యూనిట్ మెడికల్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ ఆర్‌డిఓ కార్యాలయంలో
## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు జాతీయ నాయకులైన గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ.. త్యాగధనుల స్ఫూర్తితో సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు అందరికీ చేరువు కావాలన్నారు. భారత ప్రభుత్వం వందేమాతర గేయమునకు చట్టబద్ధత కల్పించడం ద్వారా భారతీయుల్లో ఐకమత్యం పెంపొందించేలా చేసిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా వికసిత భారత్ రూపకల్పనకు కంకణ బద్ధులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### కాకినాడ జిల్లా కోర్టు ప్రాంగణంలో
## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాకినాడ కోర్టుకు చెందిన న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి జి. ఆనంది ఆధ్వర్యంలో న్యాయాధికారులు, సిబ్బంది కలిసి 50కి పైగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయ పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం కాకినాడ న్యాయవ్యవస్థలో దేశభక్తితో పాటు పర్యావరణ పరిరక్షణపై ఉన్న చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది.

### పిఎంఆర్ విద్యామందిర్‌లో ఘనంగా
## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### 'సత్యమేవ జయతే' స్ఫూర్తితో దేశభక్తి కార్యక్రమాలు : డైరెక్టర్ పాలూరి విజయ్‌కుమార్



**పిఠాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు, గొల్లప్రోలు హైవే వద్ద ఉన్న పిఎంఆర్ విద్యామందిర్‌లో కరస్పాండెంట్ పాలూరి నాగిని చంద్ర ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో డైరెక్టర్ పాలూరి విజయ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పాలూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 'సత్యమేవ జయతే' అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్యక్రమాలను నిర్వహించామన్నారు. సత్యమేవ జయతే నినాదం ప్రాముఖ్యత, సత్యం యొక్క గొప్పతనంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఏహెచ్ఎం సలాది ఉమా, భాను, వ్యాయామ ఉపాధ్యాయులు శివప్రసాద్, భాగ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తలాడిని పరామర్శించిన వైకాపా నాయకులు



**కోరుకొండ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కొవ్వూరు నియోజవర్గ మాజీ శాసనసభ్యులు నియోజకవర్ వర్గ వైకాపా ఇన్చార్జ్ తలాడి వెంకట్రావు ఇటీవల ప్రమాదానికి గురి అయ్యారు. ఆయన ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు తోరాటి శ్రీను, వనుం గంగాధర్, ఆకుల శ్రీను తదితరులు మాజీ శాసనసభ్యులు వెంకటరావును పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీడీవోగా బత్తిన అశోక్ కుమార్

### బత్తినకు పలువురు అభినందనలు



**కోరుకొండ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ ఉత్తమ ఎంపీడీవో ఎంపికయ్యారు. శనివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించిన 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఎంపీడీవో ఎంపికైన బత్తిన అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరు చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్నారు. సందర్భంగా అశోక్ కుమార్ ను మండల ప్రజాపరిషత్ సిబ్బంది, మండలంలోని వివిధ శాఖల అధికారులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతికశాఖమాత్యులు కందులు దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన స్కూల్ కమిటీ చైర్మన్ రామరాజు



**గోకవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం డ్రైవర్స్ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ నక్కా రామరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా చైర్మన్ నక్కా రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను శ్రద్ధగా విని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం కూటమి నాయకులు విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## పురుషోత్తపట్నం జడ్పీ హైస్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**సీతానగరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం జడ్పీ హైస్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవవేడుకలు పాఠశాల విద్యార్థుల ఉత్సాహ పూరిత జాతీయ గీతాలాపనతో ఘనంగా జరిగాయి.జడ్పీ హైస్కూల్ చైర్మన్ ఉందుర్తి ఇస్సాకు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.తదుపరి పిల్లలకు స్వీట్లు చాక్లెట్లు పంచారు.అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కి ఈ పాఠశాల నుంచి పనమాల వివేక్, కొండు గణేష్, పి.. దినేష్ లు ఎంపికైన సందర్భంగా ఈ సంవత్సరములో మండలంలో ఎక్కువ విద్యార్థులు సెలెక్ట్ అయిన పాఠశాలగా పురుషోత్తపట్నం పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపికైన విద్యార్థులను గ్రామ పెద్దలు సత్కరించడం జరిగింది. అలాగే పాఠశాలను ప్రథమ స్థానంలో నిలిపినందుకు గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు రామచంద్రపురం సొసైటీ చైర్మన్ మండ వెంకటేశ్వరరావు, మండ రాంబాబు, చెరుకూరి వీర్రాజు, వేములపల్లి గంగరాజు, షేక్ మీరా షరీఫ్,శరత్, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ ఎం సంతోషిమాత,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎల్ ఎస్ ఎస్ ప్రసాద్,ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# దేశభక్తి, సమైక్యతా స్ఫూర్తితో 80వ స్వాతంత్ర్య వేడుకలు

## 10 కోట్ల మత్తు రహిత ప్రతిజ్ఞలకు శ్రీకారం : కలెక్టర్ మహేష్‌కుమార్



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అమలాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవితో కలిసి స్వాతంత్ర్య సమరయోధులు, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మిషన్ స్పందన్, బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన '10 కోట్ల మత్తు రహిత ప్రతిజ్ఞలు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారి స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కేవలం హక్కులను పొందడం మాత్రమే కాదని, దేశం పట్ల బాధ్యతలను నిర్వర్తించడం కూడా అని అన్నారు. దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందని తెలిపారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి అందేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

**వికసిత్ భారత్ -2047లో యువత కీలకం**

వికసిత్ భారత్ -2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, సాంకేతికత, స్టార్టప్‌లు, సామాజిక సేవ వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువశక్తి ప్రధానమైనదని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, నీటి సంరక్షణ, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో ప్రజలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. 'దేశ అభివృద్ధి-మన బాధ్యత' అనే భావనతో ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ జెండా, జాతీయ గీతం, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ దేశ సమగ్రత, సార్వభౌమత్వం, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తి, ఐక్యత, సమైక్యతా స్ఫూర్తిని మరింతగా పెంపొందించుకుని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరిపాలన అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పుర ప్రముఖులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురం ప్రెస్ క్లబ్‌లో
# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అమలాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని చాటేలా ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికా రంగం, దృశ్య-శ్రావ్య మాధ్యమాలు, పాత్రికేయులు పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో నాటి పత్రికలు, పాత్రికేయులు కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి నేటి వరకు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో, ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటిని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకరులు స్వయంగా ముందుకు వచ్చి ప్రెస్ క్లబ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఆనందరావు అన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలను మరింతగా పెంపొందించే కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించాలని ఆకాంక్షించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం నియోజకవర్గ ప్రజలకు, పాత్రికేయులకు ఎమ్మెల్యే ఆనందరావు శుభాకాంక్షలు తెలిపారు. దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరూ దేశ ప్రగతిలో తమవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, వివిధ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన విలేకరులు, పాత్రికేయులు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకుంటూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# భాష్యం బ్లూమ్స్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## ఉత్సాహంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ – విద్యార్థులకు ప్రమాణ స్వీకారం – ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు, పతకాల ప్రదానం



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణాన్ని జాతీయ జెండా రంగులతో అలంకరించి, విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని కూడా ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఫైర్ ఆఫీసర్ పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, దేశభక్తి వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యలో రాణించడంతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈస్ట్-3 జోన్ జెడ్ఈఓ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల స్థాయిలో విద్యతో పాటు నాయకత్వం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సితార ఆధ్వర్యంలో ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వివిధ బాధ్యతలను స్వీకరించిన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇన్వెస్టిచర్ సెర్మనీలో భాగంగా విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తామని ప్రమాణం చేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ్య అతిథులు, పాఠశాల యాజమాన్యం చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. తమ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాల్లోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ, నాయకత్వం వంటి అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సితార మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే పాఠశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యంతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనా విధానం, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

### కాజులూరులో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో
# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాజులూరు, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు సెంటర్ లోని కుళాయి చెరువు వద్ద కాజులూరు మండల పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాజులూరు మండల మాజీ సర్పంచ్, ఎంపీపీ గౌరవ శ్రీ యాళ్ల కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఫెలోషిప్ నాయకులందరూ కలిసి వారికి నూతన వస్త్రాలు, స్వీట్ బాక్సులను బహూకరించి సత్కరించారు. అనంతరం వేడుకలకు విచ్చేసిన వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రెవ. డాక్టర్ స్టీవెన్, రీజనల్ నాయకులు రెవ. ఇమ్మానుయేల్, మండల ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు బిషప్ జె. రాజయ్య, ఫెలోషిప్ చైర్మన్ డాక్టర్ స్టీఫెన్ బాబు, ప్రెసిడెంట్ పి. స్టెఫెన్, సెక్రటరీ కె. శాంతిబాబు, ట్రెజరర్ కట్టా రాజ్ కుమార్‌లతో పాటు పద్మశాలి సంఘ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి అమరావతి జావెలిన్ ఛాంపియన్‌షిప్‌కు
# శివల విద్యార్థిని ఎంపిక



**శివల, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం బాలయోగి స్టేడియంలో ఆగస్టు 12, 13 తేదీలలో నిర్వహించిన జిల్లాస్థాయి జావెలిన్ పోటీలలో శివల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పువ్వల నిత్య శ్రీ విశేష ప్రతిభ కనబరిచారు. ఈ అద్భుత ప్రదర్శనతో ఆమె రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ జావెలిన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఎంపిక ద్వారా విద్యార్థిని ఆగస్టు 19 నుండి 24వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో సత్తా చాటిన నిత్య శ్రీని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు టి. కృపాలాల్, పాఠశాల పీడీ జె. సురేష్ కుమార్, ఎంఈఓలు ఏ. నాగరాజు, సి.హెచ్. ఆంజనేయులు, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, డివిజనల్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఆని శ్రీను అభినందించారు. వీరితో పాటు ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, నీటి సంఘం అధ్యక్షులు ఎన్. సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ ఇల్ల లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పి. రమేష్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, సీఆర్‌పీలు, గ్రామ పెద్దలు బి. శివప్రసాద్, సంతు కుమార్, కూటమి నాయకులు మరియు గ్రామ ప్రజలు ఆమెకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రాష్ట్రస్థాయి పోటీలలోనూ ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, శివల గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని వారంతా ఆకాంక్షించారు.

### పేద విద్యార్థులకు అండగా
# సుజన మైత్రి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందికట్ల మెషేక్



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం తాండవపల్లి గ్రామంలో సుజన్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 80స్వాతంత్య దినోత్సవం వేడుకలు చాలా స్ఫూర్తి వంతంగా స్థానిక నాయకులు మధ్య జరిగింది.జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.నేవి దళంలో పనిచేసి దేశానికీ సేవలు అందించి, కార్గల్ యుద్ధంలో పాల్గొన్న తాండవపల్లి గ్రామస్థులు కందిగట్ల సువర్ణ రాజుకు గ్రామ నాయకులు ఆధ్వర్యంలో సన్మానించారు. నేవిలో పని చేయడమే కాకుండా నేవిలో కీలక పాత్ర పోషించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా పి-4 కార్యక్రమంలో భాగంగా నాలుగు నీరుపేద కుటుంబాలు నుండి చదువుకుటున్న 8మంది విద్యార్థుల సుజన మైత్రి చారిటబుల్ ట్రస్ట్ - చైర్మన్ కందికట్ల మెషేక్, పద్మావతి అండగా నిలిశారు. స్థానిక నాయకులు చేతులు మీదగా ఈ నెలనుండి ప్రతీ నెల ప్రతీ విద్యార్థికి 500 రూపాయలు చొప్పున ఎనిమిదెమందికి 4వేలు రూపాయలు అందిస్తామని, 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈరోజు నుండి ఈ సేవా కార్యక్రమం చేపట్టామని సుజన మైత్రి చారిటబుల్ ట్రస్ట్ - చైర్మన్ కందికట్ల మెషేక్ తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు గంగుమళ్ళ ఏసుబాబు, పరమట శరత్ బాబు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు,మాజీ ఎంపీటీసీ సభ్యులు కైరం సత్తిబాబు, పరమట శ్రీనివాసరావు, కైరం రాము, నంద్యాల దొరబాబు, రంకిరెడ్డి శ్రీను,సరేళ్ళ అంబేద్కర్, పోతుముడి రవి కుమార్,రేవు ప్రసాద్,కుంచే రవికుమార్, గుత్తాల శ్రీను,కుంచే రాముడు, కొండ, తదితరులు పాల్లోన్నారు.

# కొడుకును కోల్పోయిన తల్లికి అండగా డీటీఓ



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** పి4 స్ఫూర్తితో రోడ్డు ప్రమాదంలో కొడుకును కోల్పోయిన కామాని ఆదిలక్ష్మిని దత్తత తీసుకున్న జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మానవతా దృక్పథంతో ఆమెకు అండగా నిలుస్తున్నారు. పల్లిపాలెంలోని ఆమె స్వగృహానికి శనివారం విచ్చేసిన డీటీఓ మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలక్ష్మి తన కుమారుడిని కోల్పోయారు. ఈ ఘటనతో తీవ్ర విషాదంలో ఉన్న ఆమెకు పి4 స్ఫూర్తితో దేవిశెట్టి శ్రీనివానరావు అండగా నిలిచారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగిగా మాత్రమే కాకుండా మానవతావాదిగా అండగా నిలుస్తూ ఆదిలక్ష్మికి ధైర్యం కల్పిస్తున్నారు. శనివారం డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లారు. ఆమెతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని ఆదిలక్ష్మికి భరోసా కల్పించారు. తన కుమారుడిని కోల్పోయిన బాధలో ఉన్న తల్లికి అండగా నిలిచి, ఆమె జీవనానికి భరోసా కల్పిస్తున్న డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు సేవా దృక్పథాన్ని పలువురు అభినందించారు. పి4 స్ఫూర్తితో అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తుందని పలువురు పేర్కొన్నారు.

# ఎస్పీ క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక బాధ్యతను నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు సిబ్బందికి స్వయంగా మిఠాయిలు అందజేసి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ రాజేష్, సోషల్ మీడియా సీఐ తమ్మినాయుడు, ఆర్ఐ బ్రహ్మానందం, ఆర్‌యస్ఐ ఏసుబాబు తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాష్యం స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని బాష్యం స్కూల్ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశం పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ.పీ.ఆర్.ఈ.ఎస్. స్కూల్, సమనస ప్రిన్సిపాల్ వై. టిమోతి శామ్యూల్ రాజ్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా బాష్యం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వి. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ వంటి రంగాల్లోనూ ప్రదర్శించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, భారతీయ సంస్కృతి, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణం జాతీయ జెండాలతో, దేశభక్తి నినాదాలతో సందడిగా మారింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆద్యంతం దేశభక్తి భావనతో ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో బాష్యం స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పాఠశాల సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# అన్సారీని పరామర్శించిన ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద కోలుకుంటున్న విశ్వంవాయిస్ విలేకరి అన్సారీని సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అలీ కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అన్సారీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో డిజిటల్ మేనేజర్, ఐటీ వింగ్ అధ్యక్షుడు యరమాటి వెంకన్నబాబు, పట్టణ బూత్ కమిటీ కన్వీనర్ సూరంపూడి సత్యప్రసాద్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, దొడ్డిపట్ల రఘువేంద్ర, షేక్ సర్కార్, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అమలాపురం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆకుమర్తి బేబీ రాణి, అమలాపురం పట్టణ అధ్యక్షుడు అయ్యల భాషా, జిల్లా అధికార ప్రతినిధి అరిగెల నాని, ఎస్ఐఆర్ అమలాపురం కన్వీనర్ సంసాని రత్నకుమార్, సీనియర్ నాయకుడు ఇళ్ల సత్యనారాయణ, అంబాజీపేట మండల అధ్యక్షుడు కురసా ఆంజనేయులు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మెహబూబా, గోకరకొండ గంగన్న స్వామి, అరిగెల తేజ వెంకటేష్, జంగా రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

కనిగిరి విశ్వేశ్వరరావు ప్రిన్సిపాల్



**కోటనందూరు, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ సార్వభౌమత్వం భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ కనిగిరి విశ్వేశ్వరరావు అన్నారు. కాకినాడ జిల్లా, తుని లోవ కొత్తూరు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనముగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల గౌరవ వందనాన్ని ప్రిన్సిపాల్ విశ్వేశ్వర స్వీకరించిన అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన ఈవెంట్స్ ను తిలకించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వేచ్ఛ స్వాతంత్రం ఒక అమూల్యమైన వరం ఎందరో మహనీయులు త్యాగ ఫలితముగా 1947 ఆగస్టు 15 తేదీన మనకు స్వాతంత్రం సిద్ధించిందని, దేశం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను, సైనికులను స్మరించుకుంటూ వారి యొక్క అడుగుజాడల్లో దేశాన్ని అభివృద్ధి చేయడం పౌరులుగా మన మీద ఆధారపడి ఉందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత భారత్) తీర్చిదిద్దడమే మన లక్ష్యం అని, మన దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ వారసత్వాన్ని, బాధ్యత, ఐక్యత మరియు అంకితభావంతో ముందుకు తీసుకు వెళ్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం చెప్పినట్లుగా నువ్వు అభివృద్ధి చెందు దేశాన్ని అభివృద్ధి చెయ్యి అనే నినాదంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ అంబేద్కర్ గురుకులం బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

మంత్రి సుభాష్ సమక్షంలో 150 మంది వైసీపీ కార్యకర్తల చేరిక



**కాజులూరు, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో కాజులూరు మండలం ఆండ్రంగి గ్రామానికి చెందిన సుమారు 150 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, పారదర్శక పాలన, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, డీసీ పేపకాయల బాబ్జి, గ్రామ టీడీపీ అధ్యక్షులు రాజుబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఎ.పి.యస్.పి 3వ పటాలము, పాఠశాల




**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా 3వ పటాలం ఎ.పి.యస్.పి. ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కమాండెంట్ కె. నవీన్ కుమార్ మరియు పద్మ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలలో భాగంగా కమాండెంట్ కె. నవీన్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలిపారు. మన దేశం వందల సంవత్సరాల బానిసత్వం నుండి విముక్తి పొందిన చారిత్రక సందర్భానికి గుర్తుగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. గత 80 సంవత్సరాలలో భారతదేశం విద్య, వ్యవసాయం, అంతరిక్షం, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో గొప్ప పురోగతిని సాధించిందని కమాండెంట్ పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం స్వయం సమృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. భారతదేశం ఏ80 నుంచి 2047లో 100 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకల వరకు మన ప్రయాణం మరింత అభివృద్ధి చెందిన, శక్తివంతమైన భారతదేశం వైపు సాగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో నేటి విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచు కోవాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ, సమాజాన్ని, ప్రకృతిని, మన సంస్కృతిని మరియు ప్రతి భాషను, ప్రతి సమాజాన్ని గౌరవించాలని తెలిపారు. భారతదేశ వైవిధ్యాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అన్నింటికంటే ముందుగా ప్రతి విద్యార్థి తన దేశాన్ని ప్రేమించాలని, దేశం పట్ల బాధ్యత మరియు గౌరవ భావన కలిగి ఉండాలని కమాండెంట్ సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకుబహుమతులు అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేష ధారణలు,సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్స్ జి.ఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మన్మథరావు, స్కూల్ ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్వేచ్ఛా స్ఫూర్తితో

# స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేద్దాం..

**కాకినాడ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**





**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, కులమతాలకు అతీతంగా రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తదితరులతో కలిసి 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలోని జాతీపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియ, డీఆర్ఓ డా.డి.తిప్పేనాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆయన చాక్లెట్లు పంచిపెట్టి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతో మంది మహనీయుల ఆత్మబలిదానం, స్వాతంత్ర్య సమరయోధుల అచంచల దేశభక్తి ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామన్నారు. ఆ త్యాగధనుల ఆశయాలను గౌరవించడం మన బాధ్యతని ఆయన తెలిపారు. మనకు లభించిన ఈ స్వాతంత్ర్య ఫలాలను సద్వినియోగం చేసుకుంటూ, జాతిని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం అంటే కేవలం పరాయి పాలన నుండి విముక్తి మాత్రమే కాదు, అది మన రాజ్యాంగం ద్వారా సామాన్యుడికి లభించిన సామాజిక, ఆర్థిక అని పేర్కొన్నారు. మహనీయులు రూపొందించిన రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను, బాధ్యతలను గుర్తుంచుకుంటూ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా, దేశం కోసం పోరాడినసమరయోధులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను మన ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ ఆర్టీసీ ఆదాయానికి విశేష కృషి చేసిన చెల్లారావు

నగదు ప్రశంసా పత్రంతో ఘన సత్కారం



**కోటనందూరు, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదాయానికి విశేష కృషి చేసిన కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ యడ్ల చెల్లారావును ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ ఎం బాలసుబ్రహ్మణ్యం ప్రశంసా పత్రము,నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, పాత కొట్టాం గ్రామానికి చెందిన యడ్ల చెల్లారావు కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తూ సంస్థకు అనేక ఆదాయ మార్గాలు అన్వేషించారు. 2024-25 లో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ వాణిజ్య ఆదాయం 127 కోట్లు ఉండగా 2025-26 సంవత్సరంలో 154 కోట్లు 12 శాతం ఆదాయం పెరుగుటకు దోహదపడ్డారు. ఆర్టీసీ సంస్థ యొక్క నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను, షాపులు, భవనాలను గుర్తించి భవనంపై టెలికం టవర్లు ఏర్పాట్లు, టెండర్ల ద్వారా వాణిజ్య వినియోగానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆర్టీసీ సంస్థ వాణిజ్య ఆస్తుల వివరాలను సాఫ్ట్వేర్ లో సమగ్రంగా నమోదు చేసి వాటి ద్వారా వచ్చే అద్దెలు ఇతర చెల్లింపులు ఆన్లైన్ విధానం ప్రవేశ పెట్టడంతో చెల్లింపులు సులభమైంది . సంస్థ వాణిజ్య ఆస్తులు సంస్థ వినియోగము, ఆదాయ వనరుల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పారదర్శంగా ఆన్లైన్ చెల్లింపు విధానం అమలు చేయడంలో చేసిన కృషిని గుర్తించి ఆర్టీసీ యాజమాన్యం ఈయనను ప్రశంసా పత్రము, నగదు బహుమతి తో ఘనంగా సత్కరించినందుకు చెల్లారావు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు వరించిన చెల్లారావును బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ఉన్నతాధికారులు, సహసర ఉద్యోగులు తదితరులు అభినందించారు.

## దేశభక్తి, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి : ఎస్పీ



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రతి పౌరుడికీ బాధ్యత ఉందని పేర్కొన్నారు. దేశభక్తి ఒక్కరోజుకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తనలో ప్రతిబింబించాలని సూచించారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ ప్రజా సేవను అత్యంత గౌరవంగా భావించి, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, నిష్పక్షపాత వైఖరి, దృఢ సంకల్పం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు. సమాజంలో ఎక్కడైనా అన్యాయం, అక్రమం, నేరం చోటుచేసుకుంటే నిర్భయంగా ఎదుర్కొని చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అదే సమయంలో ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుభూతితో విని, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు సిబ్బందికి సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న బలమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, వారు దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, డీటీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి. రాజశేఖర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ఎ. సన్యాసిరావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ పరిపాలనాధికారి ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్న

## పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు







**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విశేష సేవలందించిన కాకినాడ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు విభాగంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు, అభినందన పత్రాలను ఉప ముఖ్యమంత్రి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పరేడ్‌లో ఉత్తమంగా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించిన ప్లాటూన్‌ను కూడా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణ, సమన్వయంతో ఆకట్టుకునే ప్రదర్శన ఇచ్చిన సిబ్బందిని ప్రశంసించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి.

## వేళంగి ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకినాడ రూరల్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు స్వతంత్ర దినోత్సవం అంటే ఏమిటో అర్థమయ్యేలా వివరించారు.. జాతీయ గీతాలతో విద్యార్థుల అలరించారు. విద్యార్థులకు స్వీట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు కరప మండలం టిడిపి సీనియర్ ఎస్సీ నాయకులు పురం సత్యప్రసాద్, కుంచె సాంబమూర్తి, చాపల రవి, చాపల శివ, చాపల వీరబాబు, చిరంజీవి, స్కూల్ సిబ్బంది,గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

## భాను ప్రకాష్ స్కూల్ విద్యార్థులం.. భారతమాత బిడ్డలం..




**కాకినాడ రూరల్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేలంగి గ్రామంలో పేరు ప్రఖ్యాత గల ఇంగ్లీష్ మీడియం భాను ప్రకాష్ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపారు . ఈ స్కూలు విద్యార్థులతో భారత మాతాకీ జై, వందేమాతరం అనే నినాదాలతో ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వస్త్రధారణలో కనువిందు చేశారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చుండ్రు వెంకన్న రాయి చౌదరి, వెలుగుల లచ్చరావు, మేడిశెట్టి పట్టాభి, ఎర్ర విక్రమ్, తదితరులు విద్యార్థులకు చదువులతో స్వతంత్ర దినోత్సవం మన పండుగ అనే విధంగా కార్యక్రమం చేపట్టిన స్కూల్ యాజమాన్యం వారిని, ఉపాధ్యాయులను అభినందించారు. మేము భాను ప్రకాష్ స్కూల్ విద్యార్థులం భారతమాత బిడ్డలం అనే విధంగా ఈ ప్రత్యేక ర్యాలీ ఆకర్షణ గ్రామంలో ఉన్న అందరిని ఆకట్టుకుంది.. ఈ స్కూల్ యాజమాన్యంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు..

పండూరు చెరువు సుందరీకరణ పనులను

## పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామం (కాకినాడ - పిఠాపురం రోడ్డు)న ఉన్న పండూరు చెరువును 2 కోట్ల పైచిలుకు వ్యయంతో చేపట్టిన సుందరీకరణ, ఆధునీకరణ పనులను ఈరోజు కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ, అధికారులు, కూటమి నాయకులతో కలసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, వెలిశెట్టి రాజేష్ , శాండీ , నయీం, తుమ్మలపల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.

కరప గురుకుల పాఠశాలలో

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ బోండా సూర్యారావు



**కాకినాడ రూరల్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప గ్రామంలో 80వ స్వతంత్ర దినోత్సవం సందర్భముగా మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్, ఎస్ఎంసి చైర్మన్ వాతాడి వీరభద్ర రావు, టీచింగ్ స్టాఫ్, ఆఫీస్ & కిచెన్ సిబ్బంది అందరూ కూడా విద్యార్థులకి వారి వారి అమూల్యమైన సందేశాన్ని ఇవ్వడం జరిగింది. అలాగే ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి వైద్యనిపుణులు జనసేన నాయకులు బొండా సూర్యరావు విద్యార్థులతో ముచ్చటించి వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ తన అమూల్యమైనటువంటి సందేశాన్ని విద్యార్థులకు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతిలు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సతీష్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ హాజరయ్యారు. ఈయన చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరిగింది.. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, కూటమి నాయకులు, ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకినాడ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుల(డీఐపీఆర్ఓ) కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపసంచాలకులు బి పద్మజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగఫలము నేటి ఈ స్వేచ్ఛ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వ హించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమైనదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డివిజనల్ పీఆర్ఓ వివి. రామిరెడ్డి, పీఆర్ఓ ఎస్.అజయ్, ఏపీఎస్ జి ధర్మరాజు, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఫోటోగ్రాఫర్ సీహెచ్.నరేష్ బాబు, వీడియోగ్రాఫర్ ఐ.నాగార్జున, కార్యాలయ సిబ్బంది కే.భారతి, జె.సతీష్, ప్రసాద్, లక్ష్మి కాంతం, గోపి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
ఆదివారం, 16 ఆగస్టు 2026
www.viswamvoice.com





# వాడవాడలా ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

## రాయవరం మండలంలో దేశభక్తి వెల్లివిరిసిన 80వ స్వాతంత్ర్య దినోత్సవం







**రాయవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలో వాడవాడలా భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, గ్రామపంచాయతీలు, శిక్షణా కేంద్రాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తిని చాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఆకర్షణగా కంప్యూటర్ ల్యాబ్: రాయవరం ఎంపీపీఎస్ నం.1 పాఠశాలలో హెచ్ఎం ఎం. విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్మన్ గంట భవాని పతాకావిష్కరణ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పసలపూడి జడ్పీ పాఠశాలలో ప్రతిభకు ప్రోత్సాహం: పసలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డి. జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత ద్వారంపూడి రామచంద్రారెడ్డి 6 నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాయవరం పంచాయతీలో సానిటేషన్ సిబ్బందికి సన్మానం: గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, మాజీ సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మాజీ వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించి నిత్యావసర వస్తువులు అందజేశారు. **శ్రీ రామయ్య జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సేవాభావం:** రాయవరం శ్రీ రామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విప్పర్తి శాంతి సునీత ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. 1989-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు రూ.1.40 లక్షలతో ప్రతిభావంతులకు ప్రైజ్‌మనీ, షీల్డు, నాలెడ్జ్ పుస్తకాలు, క్రీడా సామగ్రి, రెండు స్టిచింగ్ మిషన్లు అందించారు. వివిధ దాతల ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభావంతులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఐటీసీ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పోటీల సందడి: ఐటీసీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల కేంద్రంలో నిర్వాహకులు షేక్ సుభానీబీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది తడి రామచంద్రారెడ్డి పతాకావిష్కరణ చేశారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు డ్రాయింగ్, డాన్స్, సింగింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా జరిగిన వేడుకల్లో విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానోత్సవాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందడిగా సాగాయి.

# దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతీ ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శనివారం మండపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా బురుగుంట చెరువు పార్కు వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ళ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడవాలని సూచించారు. అనంతరం కామాక్షి ఆలయం, 24వ వార్డు దుర్గమ్మ తల్లి గుడి వద్ద, గణేష్ ఆటో యూనియన్, ఐక్య కార్యాచరణ ఆటో యూనియన్, సత్య శ్రీ సెంటర్ రిక్షా స్టాండ్, మహాత్మ జ్యోతిరావు పూలే చేతివృత్తుల సంక్షేమ సంఘం, ఏడో వార్డు స్మారక మందిరం, ఆర్.ఆర్.ఆర్ ఆటో యూనియన్, వల్లూరి అప్పారావు వ్యవసాయ సొసైటీ, లక్ష్మీ గణపతి ఆటో యూనియన్, బైపాస్ రోడ్డు లారీ యూనియన్ ఆఫీస్, గోల్డ్ మార్కెట్, తాపేశ్వరం డానియల్ పాల్ చర్చి వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగబాబు, మల్లిపూడి గణేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పది కోట్ల మందితో వ్యసన ముక్తి ప్రతిజ్ఞ : బ్రహ్మకుమారీలు



**కోరుకొండ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వ్యసన ముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని కోరుకొండ బ్రహ్మకుమారిలు పార్వతి, వరలక్ష్మి తెలిపారు. శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులతో వ్యసన ముక్తి ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారిలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల రెండవ తేదీ నుండి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి శ్రీకారం చుట్టారని, ఈ కార్యక్రమంలో భాగంగా తాము ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ, వాటికి దూరంగా ఉండడానికి ప్రతిజ్ఞ చేయిస్తూన్నామ న్నారు. ఇప్పటివరకు సుమారు ఐదువేల మందితో ఈ ప్రతిజ్ఞ చేయించామన్నారు. అదేవిధంగా విద్యార్థి దశ నుండి విద్యార్థులు ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిలు పార్వతి, వరలక్ష్మి, రాజు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నన్నయలో ఘనంగా

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## వికసిత్ భారత్-2047 కలను సాకారం చేద్దాం

## జాతీయ జెండా ఎగురవేసిన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వతంత్రం వచ్చిందని, స్వాతంత్ర స్ఫూర్తితో విక్సిత్ భారత్ -2047 కలను సాకారం చేద్దామని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. శనివారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఎన్.ఎస్.ఎస్. మరియు విశ్వవిద్యాలయ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలకు 80వ భారత స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఒక విశ్వవిద్యాలయంగా, విజ్ఞానవంతులైన మేధావులను మరియు బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయడమే దేశానికి మా గొప్ప కానుక అని చెప్పారు. విద్య కేవలం జ్ఞానాన్ని అందించడమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, నూతనత్వం, కరుణ మరియు సేవా స్ఫూర్తిని కూడా పెంపొందించాలన్నారు. మన విద్యార్థులు విద్యా, పరిశోధన, వ్యవస్థాపకత మరియు ప్రజా సేవలో రాణించడం ద్వారా సమాజానికి అర్థవంతంగా తోడ్పడే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవ చేస్తూ, అభివృద్ధి చెందిన మరియు ఆత్మనిర్భర భారతదేశ దార్శనికతకు దోహదపడే ఒక సంస్థను మనమందరం కలిసి నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ చారిత్రక సందర్భంలో, మన విద్యార్థులు మన రాజ్యాంగ ఆదర్శాలను నిలబెట్టాలని, మన వైవిధ్యాన్ని గౌరవించాలని, మన పర్యావరణాన్ని పరిరక్షించాలని, మరియు మీ ప్రతిభను మన దేశ ప్రగతికి అంకితం చేయాలని సూచించారు. తరువాత విశ్వవిద్యాలయం తరఫున వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య డి కళ్యాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగ పాలనను వీడాలి

## ఇప్పటికైనా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలుపరచాలి - దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది

## ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మండపేట టౌన్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా తెల్లని పావురాలను గాలిలోకి వదిలారు. పార్టీ కార్యకర్తలు భారత్ మాతా కీ జై, "జై హింద్ నినాదాలతో ఆవరణ ప్రతిధ్వనించింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి పొందడానికి ఎంతోమంది అమరవీరులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలు మెచ్చుకునే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ రాజబాబు, టౌన్ వైసిపి కన్వీనర్ పిల్లి శ్రీను, మున్సిపల్ మాజీ విప్ పోతంశెట్టి ప్రసాద్, టౌన్ వైసిపి బూత్ కన్వీనర్ సూరంపూడి సత్యప్రసాద్ తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి లేని గొప్ప రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు అందించారని, ఆ రాజ్యాంగ విలువలను కూటమి ప్రభుత్వ పెద్దలు అనుసరించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుడుపూడి రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, దుర్గాప్రసాద్, పల్లవి ప్రసాద్, చంద్రమల్ల బుల్లి వీర్రాజు, వాసంశెట్టి శ్రీనివాస్, విసుపురెడ్డి శివ, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, పోతుల రాంబాబు, పలివెల భాస్కర్, యాండ్ర బుజ్జి, జిల్లా కార్యదర్శి టేకుముడి శ్రీను, ఎర్రగుంట అయ్యప్ప, యారమటి వెంకన్నబాబు, కోళ్ళ శ్రీను, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, జిల్లా యువజన విభాగ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు, పోలిశెట్టి గణేష్, కోణాల చంద్రబోస్, మాజీ కౌన్సిలర్ ముమ్మిడివరపు బాపిరాజు, జొన్నపల్లి సత్తిబాబు, మందపల్లి రవి, సయ్యద్ రబ్బానీ, చోడే నానిబాబు, ఈలి తాతాజీ, తణుకు అశోక్,యాళ్ళ శ్రీను, ముక్కా దళయ్య, ముక్కా సుబ్రహ్మణ్యం, సలాది వీరబాబు, మీగడ శ్రీనివాస్, సాధనాల శివభగవాన్, వల్లు ప్రశాంత్, తీగిరెడ్డి మహేష్, శెట్టి నాగేశ్వరరావు, మట్టపర్తి గోవిందరాజు, పాలింకి కిషోర్, పాలింగి శ్రీను, కత్తుల హరీష్, బిల్లగుర్తి అంజిబాబు తదితర నాయకులు, వార్డు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ ఏజెంట్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గోకవరంలో ఘనంగా జెండా వందనం



**గోకవరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం ప్రధాన రహదారిలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం జెండా వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను దాసరి సతీష్ ఆవిష్కరించి జాతీయ జెండాకు వందనం చేశారు. స్వాతంత్ర్యం కోసం దేశ నాయకులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా యళ్ల శేషు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దాసరి సతీష్, యళ్ల శేషు, తామర్ల రాంబాబు, పులపర్తి బుజ్జి, గోర్ల శ్రీను, కర్రీ సూరారెడ్డి, గండ్రెడ్డి సన్యాసిరావు, పైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయ్

# అవార్డు అందుకున్న తాసిల్దార్ సునీత

**తాసిల్దార్ సునీతకు పలువురు అభినందనలు**



**కోరుకొండ, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కోరుకొండ తాసిల్దార్ సునీత బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పలు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సునీత బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సునీతకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ టీవీ రంగారావుకు ఉత్తమ పురస్కారం



**మండపేట టౌన్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం కమీషనర్ టీవీ రంగారావు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఈ అవార్డు ఆయన అందుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి లు ప్రశంస పత్రాన్ని అందజేశారు. మండపేట పురపాలక సంఘం రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో తీసుకురావడానికి కమీషనర్ టీవీ రంగారావు విశేష కృషి చేశారు. ఈ నేపధ్యంలో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు ఈ పురస్కారాన్ని అందించింది. కమీషనర్ టీవీ రంగారావు కు అవార్డు రావడం పట్ల రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కమీషనర్ టీవీ రంగారావు ను అభినందించారు. మునిసిపల్ ఉద్యోగులు సిబ్బంది, డీ ఈ శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాస్ స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్ ఆర్ ఓ మాచిరాజు రవి ఆర్ ఐ కొత్తపల్లి సత్తిబాబు శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీ రమ్య, ఏ ఇ లు దాసరి పవన్ అనూష లక్ష్మీ తదితరులు కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

### సాధన మహిళా మండలి ఆధ్వర్యంలో

# ఘనంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**సీతానగరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సాధన మహిళా మండలి ప్రాంగణంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. సాధన మహిళా మండలి అధ్యక్షురాలు పి.సుజ్ఞాన కుమారి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలు, సాధన ఆశ్రమ పిల్లల ఉత్సాహపూరిత జాతీయ గీతాలాప నతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంతరం కార్యక్రమానికి విచ్చే సిన అతిథులు మన జాతి పిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ,నోబెల్ పురస్కార గ్రహీత మదర్ థెరిస్సా చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ పురుషోత్తపట్నం అధ్యక్షులు మండ రాంబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషోత్తపట్నంలో సాధన ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. సాధన మహిళా మండలి చేపడుతున్న అనేక సామాజిక, సేవా కార్యక్రమాల వల్ల తమ గ్రామానికి మంచి గుర్తింపు వచ్చిందని, ఇందుకు తమ గ్రామం ఎంతో గర్విస్తోందని కొనియాడారు. స్థానిక పెద్దలు వెలిచేటి సిరి మాట్లాడుతూ సాధన ఆశ్రమం ప్రతిరోజూ వృద్ధులకు ఆకలి తీర్చడమే కాకుండా, అనాథలను, అభా గ్యులను చేరదీసి ఉచిత భోజన, వసతి సదుపాయాలతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దడం అభినంద నీయమని సంస్థ సేవలపై ప్రశంసలు కురిపించారు.గ్రామ యువ నాయ కులు చెరుకూరి మణి మోహన్ మాట్లాడుతూ సాధన ఆశ్రమంలో జరు పుకున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు యువతకు ఎంతో స్ఫూర్తి దాయకంగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు మండ రాంబాబు, వెలిచేటి మెహర్ బాబా(సిరి), చెరుకూరి వీర్రాజు, కారిచర్ల విజయ శంకర్, మండ వెంకట రామారావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఉందుర్తి ఇస్సాకు, యలమాటి రమణ, చెరుకూరి మణి మోహన్, సీతా నగరం ప్రెస్ క్లబ్ చైర్మన్ పసలపూడి రత్నరాజు,పసలపూడి సుందర్రావు, అంగన్వాడీ టీచర్ పుట్టా రామ లక్ష్మి, ఆయా రామలక్ష్మి,దళిత పెద్దలు యాళ్ళ అర్జయ్య, రాయి లాజరు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మండపేట మండలంలోని స్కూళ్లకు 10 అకడమిక్ ఇన్ట్రక్టర్ పోస్టులు

# 16 నుండి దరఖాస్తుల ఆహ్వానం

**మండపేట టౌన్, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలికంగా అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా మండపేట మండలంలోని 5 ఉన్నత పాఠశాలలకు మొత్తం 10 పోస్టులను మంజూరు చేసింది. మంజూరైన పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారపూడి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టుకు ఒక పోస్టు, యేడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ, పి ఎస్ , బి ఎస్, సోషల్ సబ్జెక్టులకు 3 పోస్టులు, మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ, సోషల్ కు 2 పోస్టులు, ఎస్‌జి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు సబ్జెక్టుకు 1 పోస్టు, గొల్లపుంత సర్దార్ వేగుళ్ళ వీర్రాజుమున్సిపల్ స్కూల్‌లో హిందీ, పీఎస్ సబ్జెక్టులకు 2 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బిఇడి అర్హత కలిగి ఉండాలి. టెట్ క్వాలిఫై అయిన వారికి స్థానికులకు ప్రాధాన్యత ఇస్తారు.ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, అర్హత సర్టిఫికెట్ల అటెస్టెడ్ కాపీలతో పాటు 3 సెట్లను ఆగస్టు 16 నుండి ఆగస్టు 21, 2026 వరకు మండపేట మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఎంపిక ప్రక్రియను జిల్లా సెలక్షన్ కమిటీ నిర్వహిస్తుంది.మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ అధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డిని సంప్రదించాలి.

### యునైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో

# భారతదేశ క్షేమం కొరకు ఐక్య ప్రార్ధన



**సీతానగరం, ఆగస్టు 15, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో పాస్టర్ జాబేద్ స్థానిక మందిరంలో సీతానగరం యునైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో భారత దేశ క్షేమం కోసం ఐక్య ప్రార్థనలు నిర్వహించారు. మన దేశం కోసం మన రాష్ట్రం కోసం,అధికారుల కోసం,సంఘాల కోసం మ నందరం ఒకే మనస్సుతో ఐక్యంగా ప్రార్ధనలు చేయా లని సేవకులు తెలియజే శారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ బిజిఎల్ మినిస్ట్రీస్ అధినేత రాజు జోషియా, కె.ఎస్.రావు, పి.అబ్రహం, మండలంలోని సేవకులు సేవకురాండ్రు పాల్గొన్నారు.



# చెఫ్ మంత్ర ప్రాజెక్ట్ యూఎస్ఏ..

## మనదైన వినోదాన్ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్తున్న ఆహా ఓటీటీ



ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహాలో వచ్చిన చెఫ్ మంత్ర షోకు ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే ఈ షో నాలుగు సీజన్లు పూర్తి కాగా ఇప్పుడు ఐదో సీజన్ ప్రారంభమైంది. చెఫ్ మంత్ర ప్రాజెక్ట్ ఖ' పేరుతో వచ్చిన సీజన్ 4 కు స్టార్ యాంకర్ సుమ కనకాల హోస్టుగా వ్యవహరించింది. అలాగే మరో నటుడు జీవన్ కుమార్ కో హోస్ట్ గా వ్యవహరించాడు. 'చెఫ్ మంత్ర ప్రాజెక్టు యూఎస్ఏ 'తో తెలుగు వినోదాన్ని భౌగోళిక సరిహద్దులను దాటి విస్తరిస్తోంది ఆహా. తొలి తెలుగు అంతర్జాతీయ నాన్-ఫిక్షన్ షోగా రూపొందిన ఈ కార్యక్రమం ప్రస్తుతం ఆహాలో ప్రసారం అవుతోంది. అమెరికా నేపథ్యంలో తెరకెక్కిన ఈ షోలో యూఎస్ఏకు చెందిన ఐదుగురు కంటెస్టెంట్లు పాల్గొంటున్నారు. ఫుడ్, కల్చర్, ఎంటర్టైన్మెంట్, ఎమోషన్, కలగలిపిన ఈ కార్యక్రమం భారత్‌లోని తెలుగు ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఆకట్టుకునేలా రూపొందించబడింది. 'చెఫ్ మంత్ర ప్రాజెక్టు యూఎస్ఏ'లో ప్రధానంగా అమెరికాలో తెలుగు వంటకాలు, వాటి ప్రత్యేకతను సెలబ్రేట్ చేస్తున్నారు. మనకు సుపరిచితమైన రుచులు, వంటకాల సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేస్తోంది. యూఎస్ఏకు చెందిన ఐదుగురు కంటెస్టెంట్లను పార్టిసిపేట్ చేస్తూ, ఫుడ్ రిలేటెడ్ ఛాలెంజ్‌లు, పరస్పర సంభాషణలు, వారి వ్యక్తిగత అనుభవాలు, వారి జర్నీ ద్వారా కార్యక్రమాన్ని అత్యంత ఆసక్తికరంగా మార్చేస్తున్నారు. దీంతో వినోదంతో పాటు భావోద్వేగాలకు కూడా ఈ షోలో ప్రాధాన్యం లభిస్తోంది. సుమ కనకాల ఈ కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రేక్షకులతో ఆమెకు ఉన్న రిలేషన్, ప్రత్యేకమైన హోస్టింగ్ శైలి షోకు మరింత వినోదాన్ని జోడిస్తోంది. తెలుగు వినోదాన్ని మరింత విస్తృత పరిధిలోకి తీసుకెళ్లేందుకు, లోకల్ కంటెంట్‌కు ఉన్న సాంప్రదాయ సరిహద్దులను దాటి మనవారికి అందించాలని ఆహా చేస్తున్న ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం పెద్ద ముందడుగుగా చెప్పుకోవచ్చు. ప్రత్యేకమైన తెలుగు వంటకాలు, సంస్కృతిని అంతర్జాతీయ నేపథ్యంతో మేళవించడం ద్వారా 'చెఫ్ మంత్ర ప్రాజెక్టు యూఎస్ఏ ' స్థానిక సాంస్కృతిక అనుబంధాన్ని, గ్లోబల్ ప్రాతినిధ్యాన్ని ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. ముఖ్యంగా అమెరికాతో అనుబంధం ఉన్న తెలుగు ప్రేక్షకులకు ఈ షో మరింత ఆకర్షిస్తోంది. 'చెఫ్ మంత్ర ప్రాజెక్టు యూఎస్ఏ' ప్రస్తుతం ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. అస్సలు మిస్ అవ్వకండి.

సినీ వాయిస్

అయ్యో ఎంత పనైంది..

# శ్రీలీల సినిమా ఆగిపోయిందా.!!

## అమ్మడి ఆశలు గల్లంతేనా.?



శ్రీలీల ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాలలో బిజీగా ఉంటోంది. అయితే ఈ మధ్యన ఈ ముద్దుగుమ్మకు ఏదీ కలిసి రావడం లేదు. వరుస చిత్రాల్లో నటిస్తున్నప్పటికీ అవి ఆశించిన మేర విజయం సాధించడం లేదు. దీనికి తోడు శ్రీలీల మధ్యలో వదిలేసిన లెనిన్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. దీంతో ఈ బ్యూటీకి క్రేజ్ తగ్గుతుందన్న రూమర్లు వినిపిస్తున్నాయి. యంగ్ సెన్సేషన్ శ్రీలీల హిట్ కొట్టి చాలా కాలం అవుతుంది. వరుసగా సినిమాలు చేస్తున్నా హిట్స్ మాత్రం అందుకోలేకపోతుంది. పెళ్లి సందడి సినిమాతో కథానాయికగా తెరంగేట్రం చేసిన ఆమె.. ధమాకా మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అందం, అభినయంతోపాటు ఎనర్జిటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకుంది. దీంతో తెలుగులో వరుస అవకాశాలు అందిపుచ్చుకుంది. ఓవైపు స్టార్ హీరోలకు జోడిగా నటిస్తూనే.. మరోవైపు కుర్రహీరోలస సరసన నటించింది. అయితే కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలు తెలుగులో ప్లాప్ అవుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ బ్యూటీ సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. అయితే వరుసగా ప్లాపులు వస్తున్నప్పటికీ శ్రీలీల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. తెలుగుతో పాటు తమిళ్, హిందీలోనూ సినిమాలు చేస్తుంది. ఇటీవలే పరాశక్తి సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయింది. ప్రస్తుతం శ్రీలీల అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. ప్రస్తుతం హిందీలో కార్తిక్ ఆర్యన్ సరసన ఓ లవ్ స్టోరీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదివరకే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. ఈ సినిమా గురించి ఇప్పటివరకు బాలీవుడ్ లో చాలా వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఈ సినిమా గురించి ఎలాంటి న్యూస్ రావడంలేదు. సినిమా గురించిన ఎలాంటి అప్డేట్స్ లేవు. దాంతో ఈ సినిమా ఆగిపోయిందా అని అనుమానాలు బీటౌన్ లో మొదలయ్యాయి. దాంతో ఈ సినిమా గురించి ఇప్పుడు ఓ క్రేజీ న్యూస్ బాలీవుడ్‌లో వైరల్ అవుతుంది. ముంబైలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో జాయిన్ అయిందని టాక్. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది.

# వికెట్ కోసం తల్లడిల్లిన శ్రీలంక.. రాహుల్ ఫిఫ్టీ.. పడిక్కల్ సెంచరీ.. ఫస్ట్ డే మనదే

శ్రీలంకతో ప్రారంభమైన తొలి టెస్టు మొదటి రోజు ఆటలో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. దేవదత్ పడిక్కల్ సెంచరీ, కేఎల్ రాహుల్ హాఫ్ సెంచరీతో రాణించడంతో తొలి రోజు ముగిసే సమయానికి టీమిండియా 2 వికెట్ల నష్టానికి 288 పరుగుల భారీ స్కోరు సాధించింది. గాలె ఇంటర్నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో మొదలైన తొలి టెస్టు మొదటి రోజు భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా మూడు సెషన్లలోనూ శ్రీలంక బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. రోజు ముగిసే సమయానికి భారత జట్టు 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసి అత్యంత పటిష్ట స్థితిలో నిలిచింది. కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్ మైదానంలో చూపించిన పట్టుదల లంక బౌలర్లను తీవ్రంగా దెబ్బతీసింది.

### యశస్వి రనౌట్.. పడిక్కల్ చారిత్రాత్మక సెంచరీ

టాస్ గెలిచి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఐతే 47 పరుగుల వద్ద యశస్వి జైస్వాల్ 32 పరుగులు చేసి దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత మూడో స్థానంలో క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ బాధ్యతాయుతంగా ఆడాడు. లంక బౌలర్లపై విరుచుకుపడుతూ అద్భుత శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి పడిక్కల్ 131 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున అంతర్జాతీయ టెస్టుల్లో

క్రీడావాయిస్



సెంచరీ చేసిన తొలి భారతీయ బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించాడు.

### కేఎల్ రాహుల్ సూపర్‌ఫామ్

మరోవైపు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 77 పరుగులతో ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. పడిక్కల్‌తో కలిసి రెండో వికెట్‌కు ఏకంగా 150 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఐతే జట్టు స్కోరు 197 పరుగుల వద్ద ఉన్నప్పుడు తీవ్రమైన కండరాల పట్టివేత కారణంగా రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 16 పరుగులు చేసి ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆట ముగిసే సమయానికి రిషభ్ పంత్ 27 పరుగులతో పడిక్కల్ కాంబినేషన్‌లో క్రీజులో ఉన్నాడు.

### మూడూ సెషన్లలోనూ మనదే హవా

తొలి రోజు మూడు సెషన్లలోనూ భారత బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించారు. మొదటి సెషన్‌లో 27 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 101 పరుగులు చేయగా, రెండో సెషన్‌లో 26 ఓవర్లలో వికెట్ పడకుండా 96 పరుగులు సాధించారు. ఆఖరి సెషన్‌లో 20 ఓవర్లలో వేగంగా 91 పరుగులు రాబట్టారు. శ్రీలంక బౌలర్లు రోజంతా ఒకే ఒక్క వికెట్ తీయడానికి తీవ్రంగా శ్రమించారు. అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ కేశార నువాంత 21 ఓవర్లలో 98 పరుగులు సమర్పించుకుని వికెట్ దక్కించుకోలేకపోయాడు. ప్రభాత్ జయసూర్య 24 ఓవర్లలో 77 పరుగులిచ్చి గిల్ వికెట్ మాత్రమే తీసుకోలిగాడు. మొదటి రోజు లభించిన ఈ అద్భుత ఆరంభంతో టీమిండియా మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. రెండో రోజు పడిక్కల్, పంత్ ఇదే ఊపును కొనసాగిస్తే శ్రీలంక ముందు భారీ స్కోరు ఖాయంగా కనిపిస్తోంది.

హాకీ ప్రపంచ కప్..

# తొలి మ్యాచ్‌లో అదరగొట్టిన భారత్



నెదర్లాండ్స్‌లో జరుగుతున్న హాకీ ప్రపంచ కప్‌లో భారత పురుషుల జట్టు శు భారంభం చేసింది. పూల్ డిలో వేల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్‌సేన 3-1 తేడాతో విజయం సాధించింది. భారత్‌కు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించగా.. మూడింటిని గోల్స్‌గా మార్చింది. తొలి క్వార్టర్‌లో సంజయ్ (8వ నిమిషం) గోల్ చేయడంతో భారత్ ఖాతా తెరిచింది. తర్వాత హర్మన్‌ప్రీత్ గోల్‌తో (11వ నిమిషం) భారత్ మరింత ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్‌లో ఇరుజట్లూ ఒక్క గోల్ చేయలేకపోయాయి. మూడో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ తన రెండో గోల్ (43వ నిమిషం) చేయడంతో భారత్ తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. వేల్స్ తరఫున 56వ నిమిషంలో సామ్ వెల్ష్ గోల్ చేశాడు. ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో భారత్ తలపడనుంది.

బంగ్లాతో టెస్టు..

# రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆస్ట్రేలియాకు కష్టాలే

సొంత మైదానంలో బంగ్లాదేశ్‌ను కట్టడి చేద్దామని భావించిన ఆస్ట్రేలియా చివరికి కష్టాల్లో పడింది. మొదటి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలిన ఆ జట్టు.. బౌలింగ్‌లోనూ విఫలమై నిరాశపరిచింది. తన్జిద్ హసన్ (101) సెంచరీ, నజ్ముల్ షాంటో (84), మెహిదీ హసన్ మిరాజ్ (65) అర్ధశతకాలు సాధించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగులు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్ స్కోరు 161/4. ఇంకా 67 పరుగులు వెనుకబడే ఉంది. ప్రస్తుతం క్రీజ్‌లో కామెరూన్ గ్రీన్ (43లి), అలెక్స్ కేరీ (19) ఉన్నారు.

### బంగ్లా బౌలర్ల దెబ్బకు నిలవలేక..

బంగ్లాదేశ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. 228 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆస్ట్రేలియా అప్పుడే నాలుగు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. జేక్ వెదర్లాండ్ (0) డకౌట్ కాగా.. ట్రావిస్ హెడ్ (17), మార్నస్ లబుషేన్ (31), స్టీవ్ స్మిత్ (44) పరుగులు చేశారు. హసన్ మహ్మద్



2.. తైజుల్ ఇస్లామ్, మెహిదీ చెరో వికెట్ తీశారు. ఓవర్‌నైట్ 351/6 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లా 400 పరుగులు దాటడంలో మెహిదీ హసన్ కీలక పాత్ర పోషించాడు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్ వుడ్ (6/89) కాస్త ప్రభావం చూపించాడు. బంగ్లాపై ఫైఫర్ తీసిన తొలి ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్‌గా ఘనత సాధించాడు. ఆసీస్ తరఫున 300 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొమ్మిదో బౌలర్‌గానూ హేజిల్‌వుడ్ నిలిచాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 301 వికెట్లు ఉన్నాయి.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com